"చూడమ్మా" అన్నట్టు నా నీడచాటు పెద్దవాళ్ళ నోళ్ళంట మాటలు వినబడ్డాయి. ఆ మాటల ధోరణి ననుకరిస్తూ ఆ గదిలోకి చూచీ చూడనట్టుగా తొంగిచూచి "అదిగో! అక్కడ్నేవుంది అమ్మ!" అని వ్రేలితో చూపెడుతూ, గిర్రున తిరిగి వచ్చేసేసి యథాప్రకారంగా నా పక్కమీద పండుకున్నాను. మైమఱచి నిద్రపోయాను.

"'అదిగో! అక్కడనే వుంది అమ్మ!" అన్న నా వాక్కు ఏమిటి కనిపెట్టి?" అనే సమస్య యిప్పటికీ నాలో అలాగే నిల్చి వుంది. తలుచుకొన్నప్పుడల్లా "అదిగో! అక్కడనే వుంది అమ్మ" అనేలో వోఁశవుగట్టి నమ్మకం నా హృదయ కవాటాన్ని తట్టుతూ వుంటుంది. కాని భౌతికదృశ్యం ప్రత్యక్ష పఱచుకుంటే కనవచ్చేది—ఓ తెల్లని దుప్పటి రేకు. నిలువునా నేలమీద పండబెట్టి మా అమ్మమీద నాటిరాత్రి కప్పినట్టు ఓ తెల్లని దుప్పటి రేకు.

అప్పటినుంచీ నాలో మాతృదేవతను గురించిన విచింతనం రేకెత్తినప్పుడల్లా ఆ తెల్లని దుప్పటిగూడు, రాజహంస రెక్కల్లా విప్పారి కనిపిస్తూ నా మనస్సునకు నైజ నైర్మల్యాన్ని ఎప్పటి కప్పటి కొడగూరుస్తూ వుంటుంది. అదే నా మాతృ చిహ్నము!

.... .... .... .... ....

## కడాపటి ఎందుకొమ్మ

తనువూ తరువూ ఒకలాగే ఎదిగేని అనుకొనేలా కొన్నాళ్ల కోమలంగానే అగపించేవాడు ఆ చెట్టుక్రింద ఆతగాడు. ఆతగాడి

పేరు బహూత్ ఆనందగళ్! ఏ దేశంనుంచి వచ్చి యీ దేశంలో పర్యటిస్తున్నాడో ఎవ్వరికీ తెలియదు. కొందరి మతంలో ఉత్తరాదిబిడ్డగా దోచేవాడు. కొందఱి మతంలో—అరవబిడ్డగా దోచేవాడు. కొందరిమతంలో ఆ సేతు హిమాచలం వ్యాప్తమైయున్న చెప్పన్న రక్తనాళాల రక్తం అతనిలోనే వున్నాయి అనేవారు. ఇంతకూ రూపం ఏర్పడి గర్భకూపం వెలువడ్డాక ఎవరంతవారు వారు. దాన్నే వ్యక్తిత్వం అంటారు. ఆ స్వరూపాన్ని మళ్ళీ ఎంచి, కొంచడంవుందే అది సంకుచితస్వభావం. ఇంతకూ "నీ పేరెవరు?" అని అడిగితే సమాధానమొచ్చేవి "బహూత్ ఆనందగళ్" అని. ఇంకేం కావాలి మనకు? ఒక మనిషి, ఆ మనిషికోపేరు తయారయ్యె! అది చాలదూ పెద్దకథ అతగాణ్ణి గురించి వ్రాయడానికి?

బహూత్ ఆనందగళ్ లోకానికి తెలియబడసాగింది తాను ముసీలివాడయ్యాకే! అందాకా "ఎక్కడ నీ కాపురం?" అని అడిగితే "ఇక్కడే!" అనేవాడు; కాని "ఇక్కడ!" అని అతడు చూపినచోటున ఒక గున్నమామిడిచెట్టు లేచిం దతని చుట్టూ తోరణం కట్టినట్టు. ఆకుపచ్చని కొమ్మలతో, ఒక్కొక్కప్పుడు గుమ్మున పరిమళించే పువ్వులతో, వీలైనప్పుడల్లా కాయతో పండుతో, ఎడతెరిపిలేని చోద్యం చూపెడుతూ, "బహూత్ ఆనందగళ్" తన చాయనున్నాడని చాటేదేకాదు. బహూత్ ఆనందగళ్కూడా ఆ చెట్టుయొక్క నిశ్వాసమే తన నిశ్వాసంగా, ఆ చెట్టు నీడను గూరుమంది. ఆ చెట్టు గాలి పీలుస్తూ చైతన్యం కలిగివుండేవాడు చెట్టుతో సరిసమానంగా సజీవుడై.

కానైతే చెట్టుకూ మనిషికీ ఒక తేడావుంది. చెట్టు ఏటేటా ఆకురాలి, అదో అలవాటన్నట్టు, తోడ్తో చిగురోసుకుంటూ,

ఎప్పటికప్పుడు చిగురుచేత చిఱుతగా, అప్పటికప్పుడు పుట్టి నట్టుగా లేలేతగా అగుపిస్తూనే పైకి మానై లేచిపోతుంది. మనిషి ఆలాకాదు. వాని బాహ్యస్వరూపం, బాల యౌవన కౌమార వార్ధక్యావస్థలనన్నింటినీ వేఱువేఱుగా నిరూపించి పారేస్తుంది. చిన్నప్పుడున్న నేవళీకం యౌవనమప్పు డుండదు. యౌవన మప్పుడున్న ఉద్రేకం కౌమార మప్పుడుండదు. కౌమార మప్పు డున్న కార్యదీక్ష వార్ధక్య మప్పు డుండదు. మరి వార్ధక్య మప్పు డుండే నిరర్థక వ్యాపారత్వము మరెన్నడూ వుండదు. చెట్లో? చెట్లల్లా కాదు. ఏటేటా చిగురుపట్టి, ఏటేటా పూతపూసి, ఏటేటా కాస్తుంది, తాను బ్రతికున్నన్నాళ్ళూ. మళ్ళీ ఎత్తూ ఏపూ ఎక్క ణ్ణుంచి వస్తాయో, కొండంత ఎత్తు, కొత్త రూపం ప్రతి పాదిస్తూనూ వుంటుంది.

* * * * *

పోనీ కథలో మన మనుకునే చెట్టు ఎదిగి ఎండిపోయిం దనే అని అనుకొందాం! మరిక ఇగిరిపోవడానికి అందులో పస ఏమీలేదని వో నిర్ధారణకు వచ్చాం అని అనుకోండి.—వెలుపల పెరిగే చెట్లమాట? అవి ఒకదానిమీద వొకటి బలిసి, తీగల జొంపాలతో పెనేసుకుపోయి, పురుగు ప్రాకడానిక్కూడా ఎడం లేకుండా, వనం వామనం ఏకరూపమా అన్నట్టు కాబడతాయే!

ఎందుకూ? వ్రాస్తూ వ్రాస్తూ పెఱటివైపు పరకాయించాను. ఆ పెఱట్లో మామిడిచెట్టు, మామిడిచెట్టును చేరి దబ్బమొక్క, దబ్బమొక్కమీద కెగబ్రాకి విరజాజితీగ. విరజాజితీగచెంతనే చేతిక్కాయలందేలా కాసిన చెన్నంగి కొబ్బరిచెట్టు! ఇందులో ఏ వొక్కదాన్ని విడదీసి చూడ్డానికి వల్లకాదన్నంత పచ్చి పచ్చం.

దనం చూడ ముచ్చటేసింది! నా కాపాళంగా కలం క్రిందపడేసి ఓ నిమేషం అటువైపు చూడ బుద్ధివేసింది—

అంతలో మళ్ళీ ఏదో వ్రాస్తూవున్నానన్న సంగతి జ్ఞాపకం వచ్చి కథలోని మానునుగురించి, మనిషిని గురించి యోచిస్తున్నానుగదా—మాను మాను నిలువునా, ఈ లోకాన్ని దిగవిడిచి యేమైందో అన్నట్టు, మాయమై వూరుకుంది. అంత ఎత్తు చెట్టూ పేరునుండి పేరుదాకా ఊహించి అనుకోవలసి వచ్చింది, "ఎక్కడున్నాం మనం? ఏ చెట్టుక్రింద వున్నాం?" అని—అసలు చెట్టే లేదక్కడ!—అలాగంటే ఆ మనిషికి కోపం! ఆ మనిషే మారిపోయే వున్నాడు శతవృద్ధు అయి! కాని అక్కడే కూర్చుని వున్నాడు—పేరడిగితే, "బహూత్ ఆనంద్‌గళ్" అని అంటూ.

బహూత్ ఆనందగళ్ నేనీ కథ వ్రాసేసరికి ముసలివాడై యుండడమే కాకుండా మౌనంకూడా దాల్చాడు. ఇతణ్ణి ఏమడిగినా లాభం లేదని చుట్టూ పరకాయించాను. చెట్టు వుండే పట్టు, పట్టుమీది ఆకాశం అంతా అతిఖాళీగా కాపడింది. "ఇక్కడ ఓ చెట్టు వుండేదే?" అన్నాను ముసలతణ్ణి అడిగినట్టూకాకుండా అడగనట్టూ కాకుండా! "ఈ చెట్టా?" అన్నట్టు, ఒక విత్తనం, టెంకలాంటిదాన్ని చూపించాడు ఆ వృద్ధు. ముసలిమనిషిలో, ఏదో ఒకరకంగా ప్రత్యుత్తరం, ఆడేపాళపు చైతన్యం వుందికదా అని సంతోషించాను. "టెంక, మామిడి టెంకా?" అన్నాను. అతడు ఆ టెంకను మోసేపాళపు బలం కూడా లేనివాడె వున్నాడు. టెంక పైకెత్తి ఆలా సాచినకొద్దీ అతగాడి వ్రేళ్లు కొంకర్లు పోసాగాయి. నేను ఆ టెంక నందుకుంటూ "ఇది

మామిడి టెంకేను!"- అన్నాను. అతగాడు "కాబోలు" అన్నట్టు గాను, చెట్టు అక్కడుంటే, ఎండుదున్నా, దాన్ని జేర్లబడేలాగూ జరిగాడు. ఒరిగిన ఆ మనిషికి నేలే తగిలింది కాని చెట్టు తగల్లేదు. తగలడానికి చెట్టంటూ వుంటేగా అక్కడ? కథలో అంతాఖాళీ!

*   *   *   *   *

పెఱట్లో వేఱువంక చూస్తే దడి. దడిమీదకో పొట్టికాకర పాదు, ఇటూ అటూ పాకి, చిక్కగా పాకి, కాయలు కొన్ని పండి ఎఱ్ఱగా కనిపిస్తూవుంటే, కొన్ని ఆకు చాటున కాపడకుండా పసరుమయంగా ఇఱుక్కు పోసాగాయి. పువ్వులు పసుప్పచ్చగా విప్పారి నక్షత్రాల్లా అసంఖ్యాకాలు పొదగట్టజొచ్చాయి.— "కంటి చూపున కింతచేటు క్రమ స్వరూపమే కథలో అంతఖాళీ యేమా?" యని ఒకింత విమర్శించాను. ఆలా విమర్శిస్తూనే కలం మళ్ళీ పోనిచ్చాను కాగితం వెంబడి. కథలో ఈ మాటు మనిషి వ్యక్తికూడా అగోచర మయ్యాడు. కథకంతకూ ఆధార శేషంగా నా అరచేతిలో ఆ విత్తనపు టెంకమాత్రమే మిగిలి వుంది దానిమీద అడిగాను దారేపోయే వాళ్ళను, "ఈ టెంక పాత్తే చెట్టవుతుందా?" అని. ఊసుపోక అడుగుతున్నానని బాటసారుల వూహ! సత్యము తెలిసికోవాలని నా వూహ! ఒక్కళ్ళూ జవాబుచెప్పిన పాపాన్ని పోలేదు.

"చెట్టయితే కావచ్చునుగాని మఱి మనిషిమాత్రం మళ్ళీ కనబడదు." అంది ఆకాశవాణి. ఆకాశవాణిని కూడా ధిక్కరించి వెంటనే అన్నాను "మనిషి మాత్రం ఎందుకు కనబడదు?" అని. అంటూ నేనలాగే వున్నాను నా చేతిలో ఆ టెంక కూడా మాయమై ఊరుకుంది.

*   *   *   *   *

మళ్ళీ పెరటికేసి చూచాను. ఈ మాటు పచారుగా మరో ప్రక్కకు వెళ్ళి చూచాను. అక్కడ తోటమాలి దొడువులోంచి నీళ్లు మోస్తూ క్రోటను కుండీల్లో పోస్తున్నాడు. "అయ్యగారు కథ ఏమాత్రం పొడుగు వ్రాశారు?" అని అన్నాడు ఆ తోట మాలి. నేను కథలో జరిగిన సంగతి అంతా చెప్పాను వానితో. "టెంకకూడా మాయమయిందటండీ?" అని ఆశ్చర్యపోసాగాడు.

"ఏమి అలా ఆశ్చర్యపోతున్నావు?" అన్నాను. "ఆ టెంకండీ! బాబూ! పెద్ద అయ్యగారు వెనకటి తరంలో తరిగి పారేసిన పండుతాలూకుదండీ!" అన్నాడు. "ముసీలి వాడు?" అని ప్రశ్నించాను. "వాడు పెద్దఅయ్యగారి తోట మాలీ అండి" అన్నాడు. "అక్కడుండే చెట్టు?" అని అడిగాను. "అదే ఎఱుకకు రాకుండా వుంది. ముదిచెట్టు! ముది చెట్టు!" అని జ్ఞాపకం చేసుకుంటూవున్నట్టుగా అభినయించాడు. "టెంకగల చెట్టు కాబట్టి మామిడిచెట్టు అయియుండాలి" అని అన్నాను నేను. "మామిడి చెట్టేలెండి. పుల్ల మామిడా? తియ్య మామిడా? అని యోచించేను" అన్నాడు వాడు గొంతు సవ రించుకుంటూ. "టెంకేది చిన్నబాబులూ!" అని అడిగాడు. "చూచేవా! టెంక యింకా ఎక్కడుందిరా? అప్పుడే మాయమై పోయింది!" అన్నాను ఏదో నిజంగా నా చేతికి వచ్చినట్టు, అది నిలబడకుండా మాయమైపోయినట్టు. "టెంకంటూ వుంటేశాన! తిరుగ పాతేస్తే తెలిసిపోతది, పండేతలికి పులుపో తీపో." అన్నాడు, కావడి బుజాన్ని మార్చుకుంటూ మా నిజం తోట మాలి. కథలో ముసీలి తోటమాలి మఱీ వాటం సెడి మాయమై నటు అయిపోయాడు. హారతి కర్పూరం హరించి పోయినట్టు

హరించిపోయాడు అని అనుకోండి పాఠకులు! ఒక్క అతడన్న మాటేమిటి? కథలో చెట్టు, టెంక, అన్నీకూడా మాయమై పోయినాయి. మళ్ళీ కనబడలే!

* * * * *

అయితే కొన్నాళ్ళకో కోమలరసాలాన్ని రోడ్డు ప్రక్కన చూచాను. నా చేతిలోనే టెంక మొలిచిందా అని అన్నట్టు ఇట్టే ముట్టుకు చూచాను. లేలేతగా మనస్సుకు తట్టడమే కాకుండా, చిగురు చేతికి తగలడమేకాకుండా, ఎఱ్ఱగా కంటికికూడా కని పించింది. ఇఖ దానిమీదకో కోయిల వాలి గానం చేయడమే తరువాయి అని అనిపించింది.

ఇలా వుండగా ఆ గున్నమామిడి చెట్టు కొమ్మల్లో ఒక కోలాహలం వినిపించింది, గానానికి బదులు. ఏమిటా అని చూస్తును గదా, ఎండు పుడుకలతో పేర్చిన ఒక కాకిగూడు. ఆ కాకిగూడులో, పగిలీ పగలడంలో "కు! కు! కు!" అని అంటూవున్న ఒక కోయిలగుడ్డు. ఆ గుడ్డు కూనను కాలితో తన్ని చెదరగొట్టి పారేస్తూవున్న ఒక కాకి. గమ్మున తప్పెట కొట్టాను. తల్లి కాకీ కోయిలపిల్లా రెండూ కూడా ఎగిరిపోతూ బులబులాగ్గా పేర్చబడ్డ గూడును నేలకు పడగొట్టి పారేశాయి.

ఆ గూడును చూస్తునుగదా అది అంతా ఎండుపుల్లల్తో నిర్మాణం అయివుంది. ఈ లేలేత మృదుమధుర రసాలమ్మీదకీ ఎండుపుల్లల గూడెలా వచ్చిందా? అన్నది. వెంటనే పెద్ద సమస్య అయిపోయినది నాలో నాకు. పుల్లకుపుల్ల విడదీసి చూచాను. అవి అన్నీ పుల్లలు కావు. అవి మనిషి ఎముకలు. మాంసం, మజ్జ, అంతా పోయి అతితేలికగా వున్నాయి.

ఆ ఎముకల్తోపాటు ఒక ఎండు రెమ్మ వుంది. అప్పు డను కున్నాను ఆ ముసీలివాని ఎముకలు ఆ మామిడి చెట్టుయొక్క కడాపటి ఎండుకొమ్మ. అవే అవి. ఎముకలు కావు అవీ పుల్లలే అంటారా? అదీ నాకు సమ్మతమే! కధలో ఏమంటే ఏమి కాదు?

* * * * *

ఎన్నైనా కావచ్చుగాని తిరుగచూచిన ఆ లేలేత రసాలం మాత్రం నా చేతినుండి మాయమైన విత్తనమువల్ల మొలిచిం దనడానికి ఒప్పుకున్నాడు కాదు, మా నిజం తోటమాలి. అప్పు డన్నాను, "ప్రాజెట్టు విత్తనం వెళ్ళి స్వర్గంలో కల్పవృక్షమైం" దని. "హహహ!" అని నవ్వాడు వాడు నీళ్ళు మొక్కలకు దొడదొడా పోస్తూ. కాని కడాపటి ఎండుకొమ్మమాత్రం నవ్వలేక పోయింది. పువ్వు పూయలేకపోయింది. గూడు ఎప్పుడైతే చెడి పోయిందో అప్పుడే విడిపోయింది. అదాకా చెట్టునే వున్నానను కుంది పాపం!

.... .... .... .... ....

## కోడిపుంజు అమ్మన్న

"ఎగిరే కోడి! - ఎగిసే పడవ!
చూసే పిల్ల! - కాసే పందెం!

అదిగది గదిగో! పడాలి మంచి ముక్కలు" అంటూ రివటయ్య తనకు పంచే పేకముక్కలు అందుకునేలో ఆ గుంపు మధ్యకు ఒక కోడిపుంజు ఎగిరి వాలింది. వెంటనే భోగన్న ఆ పుంజు